కమిన్స్ హ్యాట్రిక్

ఈ టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి

బంగ్లాపై ఆసీస్ ఘన విజయం

కమిన్స్ (3/29)

అంటిగ్వా: టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశను ఆస్ట్రేలియా ఘన విజయంతో ఆరంభించింది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ స్టార్ పేసర్ పాట్ కమిన్స్ (3/29) టీ20 వరల్డ్‌కప్ 2024 ఎడిషన్‌లో తొలి హ్యాట్రిక్ నమోదుచేయగా మిగతా బౌలర్లు కట్టడి చేయడంతో బంగ్లాదేశ్‌పై 28 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) గెలిచింది. అంటిగ్వా వేదికగా శుక్రవారం జరిగిన పోరులో బంగ్లా నిర్దేశించిన 141 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 11.2 ఓవర్ల వద్ద (100/2) వర్షం కురవగా.. అప్పటికే సాధించాల్సిన పరుగుల కంటే ఆసీస్ 28 రన్స్ అధికంగా ఉండటంతో కంగారూలు విజేతగా నిలిచారు. డేవిడ్ వార్నర్ (35 బంతుల్లో 53 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో మెరిశాడు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులే చేయగలిగింది. ఆ జట్టులో ప్రధాన బ్యాటర్లు విఫలమవగా సారథి నజ్ముల్ శాంటో (36 బంతుల్లో 41, 5 ఫోర్లు, 1 సిక్సర్), తౌవిడ్ హృదయ్ (28 బంతుల్లో 40, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించారు. హ్యాట్రిక్ హీరో కమిన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

బంగ్లా కష్టంగా..:

బంగ్లాదేశ్‌కు మూడో బంతికే షాక్ తాకింది. స్టార్క్ తొలి ఓవర్లోనే ఓపెనర్ తాంజిద్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులో నిలదొక్కుకోవడానికి తడబడ్డ లిటన్ దాస్ (16)ను స్పిన్నర్ జంపా బౌల్డ్ చేశాడు. రిషద్(2),షకీబ్ అల్ హసన్ (8) విఫలమయ్యారు. 103 పరుగులకే బంగ్లా సగం వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శాంటో, తౌవిడ్ ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. వీరిద్దరు కలిసి సమయోచిత ఆటతీరుతో ఆకట్టుకున్నారు. 18వ ఓవర్ వేసిన కమిన్స్.. చివరి రెండు బంతుల్లో మహ్మదుల్లా (2), మెహదీ హసన్(0)ను పెవిలియన్‌కు పంపగా 20వ ఓవర్ తొలి బంతికి తౌవిడ్‌ను ఔట్ చేసి ఈ వరల్డ్ కప్‌లో తొలి హ్యాట్రిక్‌ను తన పేరిట లిఖించుకున్నాడు.

ఆసీస్ ఈజీగా..:

ఛేదనలో ఆస్ట్రేలియా ఆది నుంచే వేగంగా ఆడింది. వార్నర్, ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 31, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) బంగ్లా బౌలర్లపై బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. 6.2 ఓవర్ల ఆట అయ్యాక ఓసారి వర్షం కురిసింది. ఆట తిరిగి ఆరంభమైన కొద్దిసేపటికే రిషద్.. హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. కెప్టెన్ మిచెల్ మార్ష్(1) నిరాశ పరిచాడు. టస్కిన్ 11వ ఓవర్లో మొదటి బంతినే వార్నర్ భారీ సిక్సర్‌గా మలిచి అర్ధ సెంచరీ పూర్తిచేసిన వెంటనే వర్షం మరోసారి ఆటకు అంతరాయం కలిగించింది. వాన వల్ల మ్యాచ్ సాగే అవకాశం లేకపోవడంతో డీఆర్ఎస్ నిబంధనలతో ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది.

ప్రపంచ కప్ ఆసీస్ హ్యాట్రిక్ హీరోస్	
బ్రెట్‌లీ(ఆస్ట్రేలియా)	2007
పాట్ కమిన్స్(ఆస్ట్రేలియా)	2024

స్టార్క్ అరుదైన ఘనత

బంగ్లాతో మ్యాచ్‌లో ఓపెనర్ తాంజిద్ వికెట్ తీయడం ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ అరుదైన ఘనత సాధించాడు. ఐసీసీ నిర్వహించే పురుషుల వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అత్యధిక వికెట్లు (95) సాధించిన బౌలర్‌గా స్టార్క్ రికార్డులకెక్కాడు. తద్వారా శ్రీలంక దిగ్గజం మలింగ (94) రికార్డును బ్రేక్ చేశాడు. ఈ జాబితాలో షకిబ్ (92), బౌల్ట్ (87), మురళీధరన్ (79) టాప్-5లో ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు:

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 140/8 (శాంటో 41, తౌవిడ్ 40, కమిన్స్ 3/29, జంపా 2/24). **ఆస్ట్రేలియా:** 11.2 ఓవర్లలో 100/2 (వార్నర్ 53 నాటౌట్, హెడ్ 31, రిషద్ 2/23)

సెమీస్‌లో సఫారీలు!

క్వింటన్ డికాక్ విజృంభణ

ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా ఉత్కంఠ విజయం

బ్రూక్, లివింగ్‌స్టోన్ పోరాటం వృథా

టీ20 ప్రపంచకప్‌లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను ఊపేసింది. ఆఖరి బంతి వరకు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెడుతూ సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికాదే పైచేయి అయ్యింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ సఫారీలు..ఇంగ్లండ్‌పై ఉత్కంఠ విజయంతో అనధికారికంగా సెమీస్ బెర్తు దక్కించుకున్నారు. క్వింటన్ డికాక్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పోరాడే స్కోరు అందుకున్న దక్షిణాఫ్రికా.. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మెరుపులు మెరిపించింది. లక్ష్యఛేదనలో బ్రూక్, లివింగ్‌స్టోన్ అద్భుత పోరాటం ఇంగ్లండ్‌ను గెలిపించలేకపోయింది.

డికాక్ (65)

గ్రాస్‌ఐస్లెట్(సెయింట్ లుసియా): టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫైట్ సమీపిస్తున్న వేళ అత్యుత్తమ జట్ల మధ్య పోరాటం అభిమానులకు పసందైన విందు అందిస్తున్నది. శుక్రవారం ఆఖరి బంతి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన సూపర్-8 పోరులో దక్షిణాఫ్రికా 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. మ్యాచ్ విషయానికొస్తే..తొలుత క్వింటన్ డికాక్(38 బంతుల్లో 65, 4ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ అర్ధ సెంచరీకి తోడు డేవిడ్ మిల్లర్(28 బంతుల్లో 43, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో సఫారీలు 20 ఓవర్లలో 163/6 స్కోరు చేశారు. ఆర్చర్(3/40) మూడు వికెట్లుతో ఆకట్టుకున్నాడు. లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 156 పరుగులకు పరిమితమైంది. బ్రూక్(37 బంతుల్లో 53, 7ఫోర్లు), లివింగ్‌స్టోన్(17 బంతుల్లో 33, 3ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. ఒక దశలో వీరిద్దరి బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ గెలుస్తుందనుకున్నా..సఫారీల సమిష్టితత్వం ముందు ఓటమివైపు నిలువాల్సి వచ్చింది. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

డికాక్ ధనాధన్: ఓపెనర్లు డికాక్, రెజా హెండ్రిక్స్(19) దక్షిణాఫ్రికాకు అదిరిపోయే ఆరంభం అందించారు. సూపర్ ఫామ్‌మీదున్న డికాక్ బౌండరీలతో దుమ్మురేపాడు. అలీ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో వరుస బంతుల్లో ఫోర్, సిక్స్‌తో మొదలుపెట్టిన డికాక్ మళ్లీ వెనుదిరిగి చూడలేదు. ఆర్చర్ వేసిన నాలుగో ఓవర్లో డికాక్ విశ్వరూపం ప్రదర్శించాడు. వరుసగా రెండు భారీ సిక్స్‌లకు తోడు ఫోర్‌తో దుమ్మురేపాడు. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 63 పరుగులు చేసింది. ప్రపంచకప్‌లో తొలి వికెట్‌కు దక్షిణాఫ్రికాకు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం కాగా డికాక్ 22 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని హెండ్రిక్స్‌ను ఔట్ చేయడం ద్వారా అలీ విడగొట్టాడు. దీంతో తొలి వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవర్ తేడాతో ఆర్చర్ బౌలింగ్‌లో డికాక్..బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. క్లాసెన్(8), కెప్టెన్ మార్క్‌రమ్(1) వెంటవెంటనే నిష్క్రమించారు. స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందనుకున్న సఫారీలు మిల్లర్ బ్యాటింగ్‌తో పోరాడే స్కోరు అందుకుంది. స్టబ్స్(12 నాటౌట్)తో కలిసి మిల్లర్ దూకుడు కనబరిచాడు.

బ్రూక్, లివింగ్‌స్టోన్ మెరిసినా: లక్ష్యఛేదనలో ఇంగ్లండ్‌కు సరైన శుభారంభం దక్కలేదు. గత మ్యాచ్ హీరో ఫిల్ సాల్ట్(11) ఓ సిక్స్, ఫోర్‌తో దూకుడు మీద కనిపించినా..రబాడ బౌలింగ్‌లో హెండ్రిక్స్ సూపర్ క్యాచ్‌తో తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత బట్లర్(17), బెయిర్‌స్టో(16), అలీ(9) ఫర్వాలేదనిపించారు. మ్యాచ్‌పై అప్పటికే పట్టు బిగించిన సఫారీలకు బ్రూక్, లివింగ్‌స్టోన్ ఎదురొడ్డి నిలిచారు. 14 ఓవర్లు ముగిసే సరికి ఇంగ్లండ్ విజయానికి 36 బంతుల్లో 77 పరుగుల దూరంలో ఉంది. ఇక్కణ్ణుంచి బ్రూక్, లివింగ్‌స్టోన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ అంతకంతకు కరిగించే ప్రయత్నం చేశారు. అయితే రబాడ 18వ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔటైతే..నోకియా 20వ ఓవర్ తొలి బంతికి మార్క్‌రమ్ సూపర్ క్యాచ్‌తో బ్రూక్ ఇన్నింగ్స్ ముగిసింది. సామ్ కరాన్(10 నాటౌట్) గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు.

సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 163/6(డికాక్ 65, మిల్లర్ 43, ఆర్చర్ 3/40, రషీద్ 1/20), **ఇంగ్లండ్:** 156/6(బ్రూక్ 53, లివింగ్‌స్టోన్ 33, మహారాజ్ 2/25, రబాడ 2/32)

హాకీకి 'ఒడిశా' స్పాన్సర్‌షిప్ కొనసాగింపు

భువనేశ్వర్: గత ఆరేండ్లుగా భారత హాకీ జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న 'ఒడిషా' ప్రభుత్వం తాజాగా దానిని 2036 దాకా పొడిగించింది. ఈ మేరకు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్.. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీతో సమావేశానంతరం వివరాలను వెల్లడించారు. 2036తో ఒడిషాకు ప్రత్యేకమైన అనుబంధముంది.

ఇటలీకి స్పెయిన్ షాక్

గెల్సెన్‌కిర్చెన్: యూరో కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీకి స్పెయిన్ షాకిచ్చింది. శుక్రవారం గెల్సెన్‌కిర్చెన్ (జర్మనీ) వేదికగా జరిగిన పోరులో స్పెయిన్ 1-0తో ఇటలీని ఓడించింది. ఆట ద్వితీయార్ధం 55వ నిమిషంలో ఇటలీ ఆటగాడు రికార్డో కలఫియోరి సెల్ఫ్ గోల్ చేయడం ఆ జట్టును దెబ్బతీసింది. యూరో కప్‌లో ఇది ఐదో సెల్ఫ్ గోల్ కావడం గమనార్హం.

రా. 8.00 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

భారత్ X బంగ్లా

నేడు సూపర్-8లో కీలక పోరు • టీ20 ప్రపంచకప్ టోర్నీ

నార్త్‌సౌండ్(అంటిగ్వా): టీ20 ప్రపంచకప్ వేటలో భారత్ టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్‌తో మొదలుపెట్టి అఫ్గానిస్థాన్‌తో సూపర్-8 పోరు వరకు అపజయమెరుగని టీమ్‌ఇండియా..అదే జోరులో బంగ్లాదేశ్‌ను చిత్తుచేయాలని చూస్తున్నది. మెగాటోర్నీల్లో బంగ్లాపై మెరుగైన రికార్డు ఉన్న భారత్ అదే పంథాను కొనసాగిస్తూ సెమీఫైనల్ బెర్తు దక్కించుకోవాలన్న పట్టుదలతో రోహిత్ సేన కనిపిస్తున్నది. ప్రస్తుత ప్రపంచకప్‌లో టాపార్డర్ వైఫల్యం భారత్‌ను కలవరపెడుతున్నది. ముఖ్యంగా రోకో(రోహిత్-కోహ్లీ) జోడీ వైఫల్యం శుభారంభాలను అందించలేకపోతున్నది. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన కోహ్లీ ప్రపంచకప్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్నాడు. రోహిత్ జతగా ఓపెనర్‌గా వస్తున్న కోహ్లీ బ్యాటు ఝుళిపించలేకపోతున్నాడు. మిడిలార్డర్‌లో రిషబ్ పంత్, సూర్యకుమార్‌యాదవ్ టచ్‌లో ఉండటం భారత్‌కు కలిసి వస్తున్నది. భారీ అంచనాలతో జట్టులోకి వచ్చిన శివమ్ దూబే ఆకట్టుకోలేకపోతున్నాడు. బౌలింగ్ విషయానికొస్తే..అఫ్గన్‌తో పోరులో బరిలోకి దిగిన బౌలర్లనే తిరిగి కొనసాగించే అవకాశముంది. మరోవైపు టోర్నీలో బంగ్లా ప్రస్థానం పడుతూలేస్తూ సాగుతున్నది. ఆసీస్ చేతిలో ఓటమిపాలైన బంగ్లా..భారత్‌కు పోటీనివ్వాలని చూస్తున్నది. ముస్తాఫిజుర్ రెహమన్, రిషాద్ హుస్సేన్ ఫామ్‌మీదుండటం వారికి కలిసిరానుంది.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, అర్షదీప్, బుమ్రా.

బంగ్లాదేశ్: నజ్ముల్(కెప్టెన్), తంజిద్, లిటన్‌దాస్, తౌహిద్, షకీబ్, మహ్మదుల్లా, మెహదీహసన్, రిషాద్, తస్కిన్, తంజిమ్, ముస్తాఫిజుర్

రేపు ఒలింపిక్ డే రన్

5వేల మందితో భారీస్థాయిలో

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటాలని ఆకాంక్షిస్తూ హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు స్టీరింగ్ కమిటీ చైర్మన్ మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే రన్ పోస్టర్, టీషర్ట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నగరంలోని ఎనిమిది ప్రధాన కూడళ్ల నుంచి ఒలింపిక్ డే రన్ మొదలై..ఎల్బీ స్టేడియంలో ముగుస్తుందని వివరించారు. దాదాపు ఐదువేల మంది ఔత్సాహిక ప్లేయర్లు రన్‌లో పాల్గొనను న్నారు. వీరి కోసం ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ కోశాధికారి మహేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కలి పురుషుడిపై కల్కి పోరాటం

ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకత్తు అనేలా ఉంది శుక్రవారం విడుదలైన ట్రైలర్. 'భగవంతుడి లోపల సమస్త సృష్టి ఉందంటారు.. అలాంటిది, మీ కడుపులో ఆ భగవంతుడే ఉన్నాడు..' అంటూ అశ్వత్థామగా అమితాబ్ చెప్పిన డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. దైవాన్ని గర్భాన మోస్తున్న దీపికను, ఆమె గర్భస్థ శిశువును కలి బారినుండి కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్న అశ్వత్థామను ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. కలియుగాంతంలో కలి పురుషుని దారుణాలు భరించలేక, మాధవుని ఆగమనం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యుల ఆక్రందనలు ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'రేపటి కోసం' జనం ఎదురుచూస్తుంటే, 'ఈ రోజును చంపితే రేపెలా ఉంటుంది?' అంటూ కలి పురుషుడు చేసే వికటాట్టహాసాన్నీ, విఫలయత్నాన్నీ ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'ఎన్ని యుగాలైనా ఎన్ని అవకాశాలిచ్చినా మనిషి మారడు.. మారలేడు..' అని నిర్భయం.. నిక్కచ్చిగా చెబుతున్న కలి పురుషుడి విచిత్రరూపంలో కమల్‌హాసన్‌ని ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఏదోఒకటి చేసి సకల సౌకర్యాలుండే 'కాంప్లెక్స్'కి వెళ్లిపోవాలని ప్రయత్నించే భైరవ ఎవరు? భైరవకీ అశ్వత్థామకూ మధ్య యుద్ధం ఎందుకొచ్చింది? ఇలా ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా ఈ ట్రైలర్ ఉంది. మొత్తంగా మన పురాణాలకు హాలీవుడ్ సొగబులద్ది, ఓ కొత్తలోకాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. 'ఇప్పటివరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు.. ఇది కూడా ఓడిపోను..' అనే డైలాగ్ నాగ్‌అశ్విన్ కోసమే రాసినట్టుంది. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొనే, శోభన, మాళవిక నాయర్.. పాత్రలు ట్రైలర్‌లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నెల 27న విడుదల కానున్న పాన్ వరల్డ్ మూవీ 'కల్కి 2898'ను ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే.

ఇడ్లీ సాంబార్ అంటే ఊరుకునేది లేదు!

చిత్రం

ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేస్తుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. తనపై వచ్చే విమర్శలపై కూడా ధీటుగా సమాధానమిస్తుంది. ఈ నేపథ్యంలో అభిమానులతో జరిపిన ఇన్‌స్టాగ్రామ్ చిట్‌చాట్‌లో ఓ నెటిజన్ దక్షిణాది యాస గురించి అడిగిన ప్రశ్నకు శృతిహాసన్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఇడ్లీసాంబార్ అంటూ దక్షిణాది వారిని అగౌరవపరిస్తే సహించేదిలేదంటూ సున్నితంగా హెచ్చరించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' పేరుతో జరిపిన చిట్‌చాట్‌లో ఓ నెటిజన్ 'మీ సౌతిండియన్ యాసలో ఏదైనా మాట్లాడండి' అంటూ వ్యంగ్యంగా ఓ ప్రశ్న అడిగాడు. దీనికి తనదైన శైలిలో బదులిచ్చింది శృతిహాసన్. 'బయటకు కనిపించకుండా ప్రదర్శించే ఈ తరహా జాతి వివక్ష మంచిది కాదు. అలాగే మమ్మల్ని ఇడ్లీసాంబార్ అంటూ గేలి చేసే ధోరణులు ఆమోదయోగ్యం కావు. మీరు మమ్మల్ని ఎప్పటికీ అనుకరించలేరు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే మంచిది' అంటూ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చింది. శృతిహాసన్ స్పందించిన తీరుపై దక్షిణాదికి చెందిన నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. అతడికి తగిన విధంగా బుద్ధి చెప్పావంటూ ప్రశంసించారు. ఇదిలా ఉండగా ..అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలో రామ్‌చరణ్‌ను ఉద్దేశించి 'ఇడ్లీవడ' అంటూ షారుఖ్‌ఖాన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఏదో సరదాకి అలా మాట్లాడినా దక్షిణాదిపై హిందీ తారలకు ఉన్న చులకన భావానికి ఆ మాటలు నిదర్శనమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శృతిహాసన్ తాజా వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

పీరియాడికల్ యాక్షన్ డ్రామా

'విరూపాక్ష' విజయంతో వందకోట్ల హీరోగా అవతరించారు సాయిదుర్గతేజ్. ఆయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమా ఇటీవలే మొదలైంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రోహిత్ కేపీ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అదో ఎడారి.. దాని నిండా ల్యాండ్‌మైన్‌లు.. మధ్యలో పచ్చని చెట్టు.. అందర్నీ ఆకర్షించేలా పోస్టర్ ఉంది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో సినిమా రూపొందుతున్నదని, గ్రాండ్ స్కేల్‌తో, భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కించనున్నామని, పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయిదుర్గతేజ్ పాత్ర చాలా శక్తివంతంగా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకోసం వేసిన భారీ సెట్‌లో తొలిషెడ్యూల్ జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

వెతికా నేనే నా జాడే..

విజయ్ ఆంటోనీ నటిస్తున్న పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకుడు. కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని సెకండ్ సింగిల్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'వెతికా నేనే నా జాడే..' అంటూ సాగే ఈ పాటను భాష్యశ్రీ రాయగా, హరి దపూషియా స్వరపరిచారు. మాష్మి నేహా ఆలపించారు. ఈ సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ్, మేఘా ఆకాశ్, మురళీశర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: భాష్యశ్రీ.

శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్

వెన్నెల కిషోర్, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందుతున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. వెన్నపూస రమణా రెడ్డి నిర్మాత. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమా నుంచి 'మా ఊరు శ్రీకాకుళం' అంటూ సాగే తొలి గీతాన్ని శుక్రవారం రిలీజ్ చేశారు. సునీల్ కశ్యప్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించారు. మంగ్లీ ఆలపించింది. శ్రీకాకుళం ప్రాంతం గొప్పదనాన్ని తెలియజేస్తూ చక్కటి విజువల్స్‌తో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. వెన్నెల కిషోర్ కెరీర్‌లో ఇదొక డిఫరెంట్ మూవీ అవుతుందని, వినోదం మేళవించిన గూఢచారి కథాంశమని చిత్ర బృందం పేర్కొంది. సీయా గౌతమ్, స్నేహ గుప్తా, రవితేజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మల్లికార్జున్ ఎన్, సంగీతం: సునీల్ కశ్యప్, రచన-దర్శకత్వం: రైటర్ మోహన్.

బుజ్జిమేక భావోద్వేగాలు

యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో వాస్తవికతకు అద్దంపట్టే కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రానికి సాహిత్ మోత్కూరి దర్శకుడు. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మూడు పాటలను విడుదల చేయడం జరిగింది. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన నాలుగవ పాటను మేకర్స్ విడుదల చేశారు. 'బుజ్జి మేక..' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, శేఖర్‌చంద్ర స్వరపరిచారు. కాలభైరవ ఆలపించారు. భావోద్వేగపూరితంగా ఈ పాట సాహిత్యం, చిత్రీకరణ సాగుతుందని మేకర్స్ చెబుతున్నారు. విజువల్స్ కూడా నేచురల్‌గా ఉంటాయని వారు తెలిపారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు నిశాంత్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగే తెలిపారు. అజయ్, ప్రియాంకశర్మ, తనస్వి చౌదరి, నోయల్‌సీన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు.

రివర్స్ ప్రేమకథ

సూర్య శ్రీనివాస్, శివ బొడ్డు రాజు, జెనిఫర్ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'EVOL' ('ఏ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్' ఉపశీర్షిక). స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రామ్ యోగి వెలగపూడి తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకనిర్మాత రామ్‌యోగి వెలగపూడి మాట్లాడుతూ 'టైటిల్ ఉపశీర్షికలో చెప్పినట్లుగా రివర్స్ లవ్‌స్టోరీగా ఓ విభిన్న కథాంశంతో ఈ చిత్రం మెప్పిస్తుంది. ఇద్దరు స్నేహితుల మధ్య నడిచే ఈ కథలో ఉండే క్రైమ్ ఎలిమెంట్ ఆసక్తిరేకెత్తిస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: తేడా బ్యాచ్ సినిమా టీమ్, సంగీతం: సునీల్ కశ్యప్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత, దర్శకత్వం: రామ్‌యోగి వెలగపూడి.

నా కెరీర్‌లో చెత్త సెలక్షన్ అంటే ఆ సినిమానే..!

నయనతార కెరీర్‌ని మలుపుతిప్పిన సంవత్సరం 2005. ఎందుకంటే ఆ ఏడాది రెండు బ్లాక్‌బాస్టర్‌లు ఆమెకు దక్కాయి. అందులో మొదటిది 'చంద్రముఖి' కాగా.. రెండోది 'గజనీ'. ఈ రెండు సినిమాల్లో నయనతార సెకండ్ హీరోయినే కావడం గమనార్హం. అయితే.. ఆమెకు గుర్తింపు తెచ్చింది మాత్రం ఈ రెండు సినిమాలే. ఆడియన్స్ అభిప్రా